www.prajapathrika.in

# ప్రజా పత్రిక


తెలుగు దినపత్రిక

శుక్రవారం 11 జులై 2025

సంపుటి : 01 సంచిక : 29 పేజీలు : 4 Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda



## వివాదాల్లో నయనతార



4

## కొత్త చిత్రాన్ని ప్రకటించిన స్టార్ బాయ్

# సీఎం సీటు ఖాళీ లేదు.. ఐదేళ్లు నేనే సీఎం

- బీజేపీ మా హైకమాండా..?
- తానే పూర్తి పదవీకాలం కొనసాగుతానన్న సిద్ధరామయ్య
- నాయకత్వ మార్పు పుకార్లకు చెక్ పెట్టిన కర్ణాటక సీఎం సిద్ధరామయ్య



2 లో

కర్నాటకలో నాయకత్వ మార్పు జరగబోతుందని.. సీఎం సిద్ధరామయ్య స్థానంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సీఎం పగ్గాలు చేపడతారని గత కొన్ని రోజులుగా కన్నడ రాజకీయాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. నాయకత్వ మార్పు లేదని కాంగ్రెస్ హైకమాండ్ క్లారిటీ ఇచ్చిన ఊహాగానాలు మాత్రం ఆగడం లేదు. ఈ క్రమంలో సీఎం మార్పుపై సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు.

# పదేండ్లు పనిచేయనోళ్లు.. ప్రగల్భాలు పలుకుతున్నరు:

### పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

- ప్రజల్లో ఉండేవారికే పదవులు వస్తాయి
- ములుగులో మరో వెయ్యి ఇండ్లకు హామీ
- బీఆర్ఎస్ నేతలు ప్రజలను మోసం చేస్తున్నారంటూ తీవ్ర విమర్శలు చేసిన సీతక్క



పదేండ్లు అధికారంలో ఉండి పనిచేయనోళ్లు.. పేదలకు ఇండ్లు ఇవ్వకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినోళ్లు ఇప్పుడు ప్రగల్భాలు పలుకుతున్నారు' అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. ప్రజల్లో ఉండే వారే నిజమైన నాయకులని, తన చివరి శ్వాస వరకు ప్రజల కోసమే పనిచేస్తానని స్పష్టం చేశారు.

# కసాయి కొడుకు, బిడ్డ అనే వార్తలే..

## వాటిని చూస్తే ప్రాణం కలుక్కుమంటోంది: ఈటల హాట్ కామెంట్స్



2 లో

గురుపూజోత్సవం సందర్భంగా సమాజం జరుగుతున్న అనేక సంఘటనల గురించి తనదైన శైలిలో బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. గురువారం మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఆనాడు ఈ కార్పొరేట్ స్కూల్స్ లేవని, ఆశ్రమాల్లో చదువులు ఉండేవన్నారు. నేడు గురువు అంటే గౌరవం లేదని, గురువులకే పంగనామాలు పెట్టేవారు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో.. సంపాదన కంటే విలువలను గొప్పగా భావించే ఈ సమాజంలో ఇప్పుడు డబ్బు, ఆస్తులే కేంద్ర బిందువు అయ్యాయని పేర్కొన్నారు.

## మందుబాబులకు బిగ్‌షాక్..

- బోనాల సందర్భంగా సికింద్రాబాద్‌లో రెండు రోజులు మద్యం షాపులు మూసివేత
- 13 నుంచి 15వ తేదీ వరకు మద్యం బంద్
- భక్తుల రక్షణకు ముందస్తు చర్యలు చేపట్టిన పోలీసులు



2 లో



2 లో

# బీసీలకు 42% రిజర్వేషన్లకు మంత్రివర్గ ఆమోదం

- పంచాయతీరాజ్ చట్టం-2018 సవరణలకు మంత్రివర్గ గ్రీన్ సిగ్నల్
- పెండింగ్ ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కేబినెట్ తీర్మానం
- రాష్ట్రంలో 22,000 పైగా కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు త్వరలో
- ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమీక్షకు ఆర్థిక శాఖకు ఆదేశాలు
- AMITY, సెయింట్ మేరీ ప్రైవేట్ యూనివర్సిటీలకు కేబినెట్ ఆమోదం
- 50% అడ్మిషన్లు స్థానికులకు కల్పించాలి: AMITY యూనివర్సిటీపై నిబంధన
- జిన్నారం, ఇంద్రీశం మున్సిపాలిటీల ఏర్పాటుకు సంబంధిత గ్రామాల డీ లిస్టింగ్‌కు ఆమోదం
- అధునాతన గోశాలల ఏర్పాటుకు ముగ్గురు సభ్యుల కమిటీ - రెండు నెలల్లో నివేదిక

రాష్ట్రంలో సగం జనాభాకు మించి ఉన్న బీసీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశం మరో శుభవార్తను ప్రకటించింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మార్చి నెలలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను ప్రభుత్వం ఆమోదించింది. విద్యా ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ ప్రాతినిధ్యం కల్పించే రెండు బిల్లులను అదే రోజు అసెంబ్లీలో ఆమోదించింది. ఇటీవలే పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అంశంపై హైకోర్టు కూడా నెలాఖరులోపు రిజర్వేషన్స్ ఖరారు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

వీటన్నింటినీ చర్చించిన మంత్రివర్గం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బీసీ డెడికేటేడ్ కమిషన్‌ను నియమించింది. రాష్ట్ర ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో కులగణన చేపట్టింది. వీటి ఆధారంగానే అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించింది

# బీజేపీ అసమర్థ పాలన వల్లే ప్రమాదాలు: మల్లికార్జున ఖర్గే



2 లో

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వం, బీజేపీపై తీస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీలో నెలకొన్న నాయకత్వ లోపం, అసమర్థ పాలన వల్లనే అన్ని రకాలుగా అవినీతి పెరిగిపోయిందని విమర్శించారు. పాలనలో ఉదాసీనత పెరిగిపోవడం మూలంగానే గుజరాత్‌లో వంతెన కూలడం, అంతకుముందు అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం వంటి విషాద ఘటనలు జరుగుతున్నాయని అన్నారు.


## ఆంధ్ర - తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్ళీ తెర మీదకు తెచ్చేందుకు కుట్ర : ఎంపీ చామల



2 లో

హరీష్ రావు, కేటీఆర్ మళ్లీ తెలంగాణ సెంటిమెంటును రగిలించే ప్రయత్నం చేస్తున్నారని, కాబట్టి ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. భువనగిరి జిల్లా కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

# అందరితో కలిస్తేనే రాజకీయాల్లో పనికి వస్తారు



2 లో

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొందరు నాయకులు మాంసం తినేవారితో, మందు తాగేవారితో కలవరని, అలాంటి వాళ్లతో పార్టీకి నష్టమే తప్ప లాభం లేదన్నారు. చెత్తా చెదారంతో కలిస్తేనే రాజకీయాల్లోకి పనికొస్తారని చెప్పుకొచ్చారు. కొంతమంది మంచితనంతో పార్టీకి నష్టం జరుగుతుందని అన్నారు. గురువారం నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ ఒక సైద్ధాంతిక పార్టీ అన్నారు. గుండెల్లో జాతీయవాదం ఉన్న వారు టీ కూడా తాగరని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నోళ్లకు ఇది కరెక్ట్ కాదన్నారు.

## నాపై అర్బన్ నక్సలైట్ ముద్ర వేశారు..

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్



2 లో

# మంత్రి ఉత్తమ్ పై నాన్ బెయిలబుల్ వారెంట్

తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో చుక్కెదురైంది. ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన పాత కేసులో విచారణకు హాజరుకాకపోవడంతో న్యాయస్థానం ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

గత అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఉత్తమ్ కుమార్ రెడ్డి సభ నిర్వహించి, ట్రాఫిక్ కు అంతరాయం కలిగించారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై అప్పట్లో పోలీసులు ఆయనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.



2 లో

# బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలి

ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షులు మాధవ్, ఏపీ మంత్రి లోకేశ్‌కు ఇచ్చిన భారత చిత్రపటంలో తెలంగాణ లేకపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భారతదేశ చిత్రపటం నుంచి తెలంగాణను తొలగించడంపై వెంటనే బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని భౌగోళిక గుర్తింపుని గుర్తించకపోవడం బిజెపి అధికారిక విధానమా..? అని ప్రధాని నరేంద్ర మోదీని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ఈ విషయంలో నరేంద్ర మోదీకి పలు ప్రశ్నలు సంధించారు కేటీఆర్. దశాబ్దాలపాటు తెలంగాణ సాంస్కృతిక గుర్తింపు కోసం, చరిత్రలో తమకు సరైన చోటు దక్కడం కోసం, ప్రత్యేక భౌగోళిక గుర్తింపు, ప్రత్యేక రాష్ట్రం కోసం ఎనలేని పోరాటాలు చేసింది తెలంగాణ గడ్డ అని కేటీఆర్ పేర్కొన్నారు.





2 లో

# బీసీలకు 42% రిజర్వేషన్లకు మంత్రివర్గ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

అందుబాటులో ఉన్న డేటా ఆధారంగా, జనాభా ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు తదుపరి చర్యలు చేపట్టాలని తీర్మానించింది.

బీసీల రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీలకు మండలం యూనిట్‌గా, ఎంపీపీ, జడ్పీటీసీలకు జిల్లా యూనిట్‌గా, జడ్పీ చైర్మన్లకు రాష్ట్రం యూనిట్‌గా పరిగణిస్తారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు అనుగుణంగా రాష్ట్రంలో అమల్లో ఉన్న పంచాయతీరాజ్ చట్టం–2018 సవరణలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. త్వరలోనే ఈ చట్టంలో చేయాల్సిన సవరణలకు అవసరమైన చర్యలు చేపడుతుంది.

రాష్ట్రంలో కొత్తగా రెండు ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. ఎమిమిటీ (AMITY) యూనివర్సిటీ, సెయింట్ మేరీ రిహాబిలిటేషన్ యూనివర్సిటీలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. AMITY యూనివర్సిటీలో మన తెలంగాణ విద్యార్థులకు, అంటే మన స్థానిక విద్యార్థులకు 50 శాతం అడ్మిషన్లకు అవకాశం కల్పించాలనే నిబంధనను ప్రభుత్వం విధించింది.

సంగారెడ్డి జిల్లాలో ఇటీవల రెండు కొత్త మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. కొత్తగా ఏర్పడ్డ జిన్నారం, ఇంద్రేశం మున్సిపాలిటీల పరిధిలో చేర్చే 18 గ్రామ పంచాయతీలను డీ లిస్టింగ్ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో అధునాతనంగా గోశాలల ఏర్పాటు, నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. వచ్చే కేబినేట్ సమావేశంలోపు కమిటీ తమ నివేదికను అందించాలని గడువు విధించింది. ఇప్పటికే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పశు సంవర్ధక శాఖ రూపొందించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ను, కొత్తగా నిర్మించే గోశాల డిజైన్లను మంత్రివర్గ భేటీలో ప్రదర్శించారు. రాష్ట్రంలో 306 గోశాలలున్నాయి. హైదరాబాద్లో ఎన్కేపల్లి, వెటర్నరీ యూనివర్సిటీ, వేములవాడ, యాదగిరిగుట్టలో అత్యాధునికంగా గోశాలలు నిర్మించాలని నిర్ణయించారు. వీటితో పాటు రాష్ట్రంలో ఉన్న గోశాలల రిజిస్ట్రేషన్లు, వాటి నిర్వహణపై సమగ్ర విధాన పత్రం రూపొందించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.

కేబినెట్‌లో కొత్త సంప్రదాయం

ఈసారి రాష్ట్ర మంత్రివర్గం కేబినేట్ భేటీలకు సంబంధించి కొత్త సంప్రదాయాన్ని ప్రారంభించింది. ఇప్పటివరకు జరిగిన కేబినెట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, అమలుపై సమీక్ష జరిపింది. 2023 డిసెంబర్ 7వ తేదీ నుంచి ఇప్పటి వరకు 18 కేబినెట్ సమావేశాలు జరిగాయి. ఈరోజు 19వ సమావేశం జరిగింది. గతంలో జరిగిన సమావేశాల్లో మొత్తం 327 అంశాలను చర్చించింది. వీటిలో 321 అంశాలను కేబినేట్ ఆమోదించింది. వీటి అమలు పురోగతిని శాఖలవారీగా అధికారులతో మంత్రివర్గం చర్చించింది.

కొత్తగా 22 వేల ఉద్యోగాలు

ఈ ఏడాదిన్నర వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసింది. వీటితో పాటు మరో 17084 ఉద్యోగాల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉంది. కొత్తగా 22033 ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు ఇవ్వాలని మంత్రివర్గం చర్చించింది. వివిధ విభాగాల్లో పని చేస్తున్న ప్రతీ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పనితీరును సమీక్షించేందుకు వీలుగా వారి ఆధార్, పూర్తి వివరాలు సేకరించాలని ఆర్థిక శాఖను మంత్రివర్గం ఆదేశించింది. ప్రభుత్వ ఉద్యోగుల హాజరుతో పాటు విధినిర్వహణలో జవాబుదారీతనం పెంచేందుకు అవసరమైన సంస్కరణలు తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఉద్యోగులకు సంబంధించి నియమించిన అధికారుల కమిటీకి ఈ బాధ్యత అప్పగించాలని నిర్ణయించారు. రెండు నెలల్లో పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ఆదేశించింది.

# సీఎం సీటు ఖాళీ లేదు.. ఐదేళ్లు నేనే సీఎం

మొదటి పేజీ తరువాయి

గురువారం కర్నాటకలో సీఎం సీటు ఖాళీ లేదని.. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని తేల్చి చెప్పారు. సీఎంగా ఐదేళ్ల పదవి కాలాన్ని పూర్తి చేస్తానని నాయకత్వ మార్పు పుకార్లకు చెక్ పెట్టారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలు నా నాయకత్వంలోనే జరుగుతాయని స్పష్టం చేశారు సీఎం సిద్ధరామయ్య. జాతీయ రాజకీయాలపై తనకు ఆసక్తి లేదని.. తాను ఎప్పటికీ కర్ణాటకలోనే ఉంటానని మనసులో మాట చెప్పారు. ఇదే సమయంలో క్రమశిక్షణ కలిగిన నేతగా పార్టీ హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ ఐక్యంగా ఉందని.. ఎలాంటి డోకా లేకుండా ప్రభుత్వం ఐదు సంవత్సరాలు అధికారంలో ఉంటుందన్నారు. ముఖ్యమంత్రిని మారుస్తారని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ అంటున్నాయని జర్నలిస్టులు ప్రశ్నించగా.. వాళ్లు ఏమైనా మా హైకమాండా..? సీఎం మార్పు గురించి వాళ్లకు ఎలా తెలుస్తుంది..? అని మీడియాను ఎదురు ప్రశ్నించారు సిద్ధరామయ్య. సీఎం మార్పు అంటూ ప్రతిపక్షాలు చెబితే మీరు రాస్తారా..? మీరు ధృవీకరించుకో వద్దా అని నిలదీశారు. నాయకత్వ మార్పు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఫైర్ అయ్యారు.

కాగా, ఈ ఏడాది చివర్లో ముఖ్యమంత్రి మార్పు గురించి కన్నడ పాలిటిక్స్ తో పాటు అధికార కాంగ్రెస్ పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య అధికార భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా నాయకత్వ మార్పు ఉంటుందంటూ ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కన్నడ నాయకత్వ మార్పు ఉండదంటూ పార్టీ హైకమాండ్ ఇప్పటికే క్లారిటీ ఇచ్చింది. అయినప్పటికీ పుకార్లు ఆగకపోవడంతో తాజాగా సీఎం సిద్ధరామయ్య క్లారిటీ ఇచ్చారు.

# మంత్రి ఉత్తమ్ పై నాన్ బెయిలబుల్ వారెంట్

తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో చుక్కెదురైంది. ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన పాత కేసులో విచారణకు హాజరుకాకపోవడంతో న్యాయస్థానం ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

గత అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఉత్తమ్ కుమార్ రెడ్డి సభ నిర్వహించి, ట్రాఫిక్ కు అంతరాయం కలిగించారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై అప్పట్లో పోలీసులు ఆయనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి నాంపల్లి లోని ప్రజాప్రతినిధుల కోర్టు లో విచారణ జరుగుతోంది.

అయితే, ఈ కేసు విచారణకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరు కాలేదు. దీంతో కోర్టు ఆయన వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అనంతరం కేసు తదుపరి విచారణను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసింది. ఆ రోజున ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యక్తిగతంగా విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని కోర్టు ఆదేశించింది.

# ‘అసలు మీరేం చేస్తున్నారు’?.. కల్తీ కల్లు ఘటనపై కేటీఆర్ ట్వీట్



కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో ఇప్పటివరకు ఐదుగురు మృతి చెందారు. మొత్తం 37 మంది అస్వస్థతకు గురయ్యారు. నిమ్స్ ఆసుపత్రిలో 31 మందికి చికిత్స అందిస్తున్నారు. వీరిలో 27 మంది ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నలుగురికి డయాలసిస్ చేస్తున్నట్లు చెప్పారు. తాజాగా ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. “హైదరాబాద్‌లో కల్తీ కల్లు బారిన పడి ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. మృతుల కుటుంబాలను వెంటనే ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలి. ఒక్కొక్క కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం అందించాలి. హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండాలి. మెరుగైన చికిత్స అందించాలి. కుటుంబం కోసం కాయకష్టం చేసే కష్టజీవులు కల్తీ కల్లు బారిన పడకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంతమంది చనిపోతే ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోకాపోవడం చాలా దారుణం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో ప్రజలకు చెప్పాలి” అని ఎక్స్ వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు.

# పదేండ్లు పనిచేయనోళ్లు.. ప్రగల్భాలు పలుకుతున్నరు:

మొదటి పేజీ తరువాయి



ములుగులోని లీలా గార్డెన్స్‌లో గురువారం జరిగిన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. కష్టపడిన ప్రతీ లీడర్, కార్యకర్తను అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నామన్నారు. నిత్యం ప్రజల్లో ఉన్న వారికి పదవులు వాటంతటే అవే వస్తాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ములుగుకు ఇప్పటికే ఐదు వేల ఇండ్లు ఇచ్చామని, మరో వెయ్యి ఇండ్లు ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు. జిల్లాలోని బంధాల, వెంకటాపురం, ఇంచించెర్వుపల్లి గ్రామాల్లో ఇండ్లు కాలిపోతే గత ప్రభుత్వం ఒక్కరికైనా ఇల్లు కట్టించి ఇచ్చిందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ లీడర్లు ఆత్మహత్యలను ప్రేరేపిస్తూ ప్రజలను ఆగం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా రేగా కల్యాణితో పాటు డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, తెలంగాణ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బంద్రు శోభారాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మార్కెట్? కమిటీ కార్యదర్శి సుచిత్ర పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ, దిశ ఫౌండేషన్, ఈఎల్ఎఫ్ ఇంగ్లిష్ సౌజన్యంతో ములుగు జిల్లాలోని 50 ప్రైమరీ స్కూళ్లలో చేపట్టిన లర్న్ టు రీడ్?90 రోజుల కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర దివాకర టీఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్‌తో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. అలాగే ములుగులోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఇన్ఫోసిస్ సంస్థతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ స్టూడెంట్లు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలని, ఉన్నత కొలువులు సాధించాలంటే ఇంగ్లిష్ తప్పనిసరి అని చెప్పారు. లర్న్ టు రీడ్ కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అర్షం రాజు, సెక్టోరియల్ ఆఫీసర్లు రమాదేవి, గుళ్లపెల్లి సాంబయ్య, ఎంఈవో వజ్జ తిరుపతి, హెచ్ఎం ఝాన్సీ పాల్గొన్నారు.

# మందుబాబులకు బిగ్‌షాక్..

హైదరాబాద్ నగర పోలీస్ శాఖ మందుబాబులకు షాకిచ్చింది. ఈనెల 13వ తేదీ ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా రెండ్రోజులపాటు మద్యం షాపులను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 13వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 15వ తేదీ ఉదయం 6 గంటల వరకూ మద్యం షాపులు మూసివేయాలని సీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. సీపీ ఆదేశాలతో హైదరాబాద్ సెంట్రల్, ఈస్ట్, నార్త్ జోన్ల పరిధిలోని గాంధీనగర్, చిలకలగూడ, లాలాగూడ, వారాసిగూడ, బేగంపేట, గోపాలపురం, తుకారాంగేట్, మారేడ్ పల్లి, మహంకాళి, రామ్ గోపాల్ పేట్, మార్కెట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న అన్ని మద్యం షాపులు రెండ్రోజులు మూతపడనున్నాయి.


ఈ ఆదివారం బోనాల సందర్భంగా సికింద్రాబాద్‌లో పటిష్ట బందోబస్త్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. నాలుగు రోజుల ముందు నుంచే పోలీసులు గస్తీ పెంచారు. అనుమానాస్పదంగా తిరిగే వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఇక ఉజ్జయిని మహంకాళి బోనాల్లో కీలక ఘట్టం భవిష్యవాణి. మాతంగి స్వర్ణలత పచ్చికుండపై నిలబడి చెప్పే భవిష్యవాణి నిజమవుతుందని భక్తుల నమ్మకం. ఈ రంగం చూసేందుకే భక్తులు ఆలయానికి తరలివస్తారు.

# బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలి - కేటీఆర్ డిమాండ్

మొదటి పేజీ తరువాయి

అయితే మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు మా సాంస్కృతిక గుర్తింపుని అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేసేలా భారతదేశ చిత్రపటాన్ని ఉపయోగించారు. అయితే, మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు మాధవ్ బహుమతిగా ఇచ్చిన మ్యాపులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ని మాత్రమే చూపించడం దారుణం. తెలంగాణ రాష్ట్రం అస్తిత్వాన్ని లెక్కచేయకుండా చేసిన చర్య మమ్మల్ని తీవ్రంగా బాధించింది. ఇది పూర్తిగా అనుచితమైంది. భారతదేశ చిత్రపటం నుంచి మా చరిత్రనే తొలగిస్తే మేమెవరం? ఇది మీ పార్టీ అధికారిక అభిప్రాయమా? అని ప్రధానమంత్రి మోదీని కేటీఆర్ ప్రశ్నించారు. లేదా ఈ చర్య కేవలం ఒక పొరపాటా అనే విషయంపై మీరు వెంటనే ప్రధాని మోదీ స్పష్టత ఇవ్వాలి. ఇది తెలంగాణ ప్రజల త్యాగాలు, రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటాలను, బలిదానాలను అగౌరవపరచడమే కాకుండా మా చరిత్రను నిర్లక్ష్యం చేసిన బిజెపి నేతలు క్షమాపణ చెప్పాలి. పొరపాటైతే, తెలంగాణ ప్రజలని అపహాస్యం చేసినందుకు మీ పార్టీ నాయకత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# నాపై అర్బన్ నక్సలైట్ ముద్ర వేశారు..
## టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ హాట్ కామెంట్స్



ఆపరేషన్ కగార్‌కి వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడిన మరుసటి రోజు నుంచి నా పై అర్బన్ నక్సలైట్, దేశ ద్రోహి ముద్ర వేశారని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం సీపీఐ మఖ్దూమ్ కార్యాలయం రీ ఓపెనింగ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలుగు నేలపై జన్మించిన మఖ్దూమ్ జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారని, మఖ్దూమ్‌కి సింగరేణి కార్మికులతో ఎనలేని బంధం ఉందని కొనియాడారు. మొదట మఖ్దూమ్ కార్యాలయం ఫౌండేషన్ స్టోన్ కి ( ఫిబ్రవరి 17, 1974) అప్పటి కాంగ్రెస్ మంత్రులు హాజరయ్యారని గుర్తుకు చేశారు. కాంగ్రెస్, కమ్యూనిస్టుల అనుబంధం విడదీయరానిదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ తో పాటు కమ్యూనిస్టులు బలపడాలని కోరుకున్న వ్యక్తుల్లో మొదటివాడిని, కమ్యూనిస్టు భావజాలానికి ఎప్పుడు మరణం లేదు. కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కొదవలేదని అన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టులతో జట్టుకట్టి విజయం సాధించామన్నారు. దేశంలో లౌకికవాదం గురించి మాట్లాడితే అర్బన్ నక్సల్స్ అవుతున్నాం. ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడితే దేశద్రోహులం అవుతున్నామని మండిపడ్డారు. ఆపరేషన్ కగార్‌తో కేంద్రం మారణకాండ కొనసాగిస్తోందని, ఇది బాధాకరం అని అన్నారు. మావోయిస్టులు చర్చకు సిద్ధమని ప్రకటించిన మానవత్వం కనికరము లేకుండా సీజ్ ఫైర్ చర్యకు పూనుకున్నారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ పేరుతో అటవీ ఖనిజ సంపదను కార్పొరేట్స్‌కి దోచిపెట్టే ప్రయత్నం కేంద్రం చేస్తోందని ఆరోపించారు. దేశం భవిష్యత్ కోసం లౌకిక వాద శక్తులు బలపడాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశంలో ఎలక్షన్ కమిషన్ కొందరు వ్యక్తులకు లాభం చేసే సంస్థగా మారడం దౌర్భాగ్యం.. ఈ పరిణామం శ్రేయస్కరం కాదు.. అని ఆరోపణలు చేశారు.

# అందరితో కలిస్తేనే రాజకీయాల్లో పనికి వస్తారు

మొదటి పేజీ తరువాయి

తమ పార్టీ సింబల్ కమలం అని, అది కూడా బురదలోనే ఉంటుందని అన్నారు. కానీ బురద అంటించుకోదని చెప్పుకొచ్చారు. ఎవరితోనూ కలవం అంటే కుదరదని అన్నారు. ఇలాంటి వారు దేశ సేవ కోసం ఎన్జీవోలో చేరొచ్చని అన్నారు. వికారాబాద్ జిల్లాలో మూడు గ్రూపులు ఉండేవన్నారు. పార్టీలో గ్రూప్స్ చేసేటోళ్లను సహించబోనని చెప్పారు. అలాంటి వారు తనకు పార్టీకి అవసరం లేదని చెప్పుకొచ్చారు. తన కన్నా చిన్నవాళ్లు ఉంటే గట్టిగా చెప్తానని, పెద్దోళ్లయితే రిక్వెస్ట్ చేస్తానని అన్నారు. పార్టీకి విరుద్ధంగా మాట్లాడేవారిని ఉపేక్షించేది లేదన్నారు. పార్టీ కింది నుంచి నిర్మాణం జరగాలి అంటే అందరితో కలవాలని అన్నారు. ఒక ఎంపీ గెలిస్తే పార్టీ అభివృద్ధి చెందినట్టు కాదని, అధికారంలోకి రావడమే ముఖ్యమని చెప్పారు. భారతదేశంలోకి 4 కోట్ల మంది రోహింగ్యాలు అక్రమంగా చొరబడ్డారని, ఇందులో 20 లక్షల మంది వరకు తెలంగాణలోనే ఉంటారని అన్నారు. దేశంలో వరి ఉత్పత్తి బాగా పెరిగిందని, తెలంగాణలో వానలు, యూరియా వల్ల దిగుబడి పెరిగిందని అన్నారు. ఇలాంటి యూరియా వరిని ఎంకరేజ్ చేయొద్దని చెప్పారు. రాష్ట్ర జనాభాకు 45 లక్షల టన్నుల వరి అవసరమైతే.. 2 కోట్ల టన్నుల వరి పండిస్తున్నామని చెప్పుకొచ్చారు. మిల్లెట్స్ ఎక్కువగా పండించాలని కోరారు. ఫాతిమా కాలేజీ భవనం కూల్చివేత అంశంపై మాట్లాడుతూ... పేద హిందువులే టార్గెట్గా హైడ్రా పనిచేస్తోందని చెప్పారు. ఎంఐఎం జోలికి పోయే సత్తా హైడ్రాకు లేదన్నారు.

# బీజేపీ అసమర్థ పాలన వల్లే ప్రమాదాలు
## : మల్లికార్జున ఖర్గె



ప్రభుత్వ ఉదాసీనత ఇలాగే కొనసాగితే సమయం వచ్చినపుడు ప్రజలే తగిన గుణపాఠ చెబుతారని ఖర్గె సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బుధవారం గుజరాత్‌లోని వడోదర జిల్లాలోని గంభీర వంతెనలో ప్రధాన భాగం కూలిపోవడంతో కొందరు చనిపోయారు. గత నెలలో అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 240 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఖర్గే వరుస ప్రమాద ఘటనలపై స్పందించారు. దేశంలో ప్రమాదాలు సర్వసాధారణంగా మారిపోయాయి. రైలు ప్రమాదాలు, వంతెనలు కూలిపోవడం, విమాన ప్రమాదాలు ఇలా వరుసగా ప్రజల్లో బీజేపీ పాలన అంటే భయం పెరుగుతోంది. తాజాగా వంతెన కూలిన ఘటన గురించి తెలియగానే దిగ్భ్రాంతికి గురయ్యాయి. 12 మంది వరకు చనిపోవడం విషాదం. ప్రమాదానికి మూడేళ్ల నుంచే వంతెన పరిస్థితి దారుణంగా ఉందని, మరమ్మతులు చేయాలని చెప్పినప్పటికీ, చర్యలు తీసుకోలేదు. 2021 నుంచి ఇప్పటివరకు గుజరాత్‌లో ఏడు వంతెన ప్రమాదాలు చోటుచేసుకున్నాయని ఖర్గె పోస్ట్‌లో పేర్కొన్నారు.

పెరిగిన మృతుల సంఖ్య

గుజరాత్‌లోని వడోదరలో వంతెన కూలి వాహనాలు నదిలో పడిపోయిన ఘటనలో మృతుల సంఖ్య పెరిగింది. గురువారం మరో నలుగురి మృతదేహాలు లభ్యం కావడంతో మృతుల సంఖ్య 15కు చేరిందని అధికారులు వెల్లడించారు. ఇంకా మరో నలుగురి ఆచూకీ దొరకాల్సి ఉంది. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఎన్డీఆర్ఎఫ్ వెల్లడించింది.

# కసాయి కొడుకు, బిడ్డ అనే వార్తలే.. వాటిని చూస్తే ప్రాణం కలుక్కుమంటోంది: ఈటల హాట్ కామెంట్స్

మొదటి పేజీ తరువాయి

వినకూడని కనకూడని సంఘటనలు అనేకం జరుగుతున్నాయని, వాటిని చూసి ప్రాణం కలుక్కుమంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగుడికి డబ్బులు ఇవ్వలేదని జన్మనిచ్చిన తల్లిని చంపుతున్నారని, మందలించిన ఖర్మానికి తండ్రిని చంపే వారిని కూడా చూస్తున్నామని, కసాయి కొడుకు, కసాయి బిడ్డ అనే వార్తలు చూస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఆడపిల్లలు కూడా తండ్రులను చంపుతున్న సంఘటనలు ఈ మధ్య కనిపిస్తున్నాయని అన్నారు. ఇది కలియుగమని బాధపడాలా ? గొప్ప సంస్కృతి ఉన్న మనం అసహ్యించుకునే విధంగా మారుతున్నామా ? అని ప్రశ్నించారు.

ఈ గురు పరంపర, మన సంస్కృతి సాంప్రదాయాలను సమున్నతంగా, సంపూర్ణంగా నిలుపుకోకపోతే మరింత వికృతచేష్టలతో మానవ జీవితాలు కలంకమయ్యే పద్ధతిలో, అసహ్యించుకునే పద్ధతిలో మారుతుందని అన్నారు. ఈ సమాజానికి పట్టిన టెన్షన్ వదిలించాలంటే ప్రతి ఒక్కరు స్పందించాలని, రాజకీయ వ్యవస్థ కూడా దీనికి బాధ్యత వహించాలని కోరారు. ఇంజనీర్ ఫెయిల్ అయితే బ్రిడ్జి కూలిపోతుంది కానీ ఒక రాజకీయ నాయకుడు ఫెయిల్ అయితే సమాజం కూలిపోతుందని అభిప్రాయపడ్డారు. రాజకీయ నాయకున్ని సమాజంలో చిన్న చూపు చూడకండి.. రాజకీయ నాయకుడు సమాజాన్ని నడిపే గురువు లాంటివాడు. ఆయన సన్మార్గంలో నడిచినప్పుడు మాత్రమే సమాజం చల్లగా ఉంటుంది. ఆ రాజకీయ నాయకున్ని ఎన్నుకునే విషయంలో కూడా అలర్ట్ గా ఉండాలని కోరారు.

# ఆంధ్ర- తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్ళీ తెర మీదకు తెచ్చేందుకు కుట్ర : ఎంపీ చామల

మొదటి పేజీ తరువాయి



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ మిగులు బడ్జెట్ తో అధికారంలోకి వచ్చి రూ. 8 లక్షల కోట్ల అప్పు చేశాడని విమర్శించారు. తెచ్చిన అప్పును సక్రమంగా వినియోగించుంటే రాష్ట్రం ఎప్పుడో అభివృద్ధి చెందేదన్నారు.

గత ప్రభుత్వం ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ లకే పరిమితమైందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 60000 ఉద్యోగాలు ఇచ్చామన్నారు. బనకచర్ల బంకను మనకు రుద్దుదామని ప్రయత్నం చేస్తున్నారని, ఆరు నూరైనా బనకచర్ల ప్రాజెక్టును కానివ్వబోమన్నారు. కేటీఆర్ కేవలం ఒక ఎమ్మెల్యే అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయి కేటీఆర్ ది కాదన్నారు. కేసీఆర్ ను చర్చకు సిద్ధం చేయాలని కేటీఆర్ కు సూచించారు. తెలంగాణ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ మొదటి అపెక్స్ కమిటీ లోనే మనకు రావలసిన నీళ్లపై కొట్లాడవలసి ఉంటే ఈ సమస్య ఉండేది కాదన్నారు. కృష్ణాజిల్లాలో తెలంగాణకు రావలసిన 299 టీఎంసీలను 10 సంవత్సరాల టీఆర్ఎస్ పాలనలో ఎప్పుడు వాడుకోలేదన్నారు.

తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంవత్సరము 280 టీఎంసీలను వాడుకున్నామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు వలన ఉత్తర తెలంగాణకు తప్ప దక్షిణ తెలంగాణకు లాభం లేదని, కాంగ్రెస్ పార్టీ హయాంలో సగం పూర్తయిన ఎస్ఎల్బీసీ, రంగారెడ్డి టన్నెల్సు 6000 కోట్ల ఖర్చు చేస్తే లక్షల ఎకరాలు సాగునీరుకు అందుబాటులోకి వచ్చేదన్నారు. కేటీఆర్ ఒక ఎమ్మెల్యే అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయి కాదని, చాలెంజ్ చేయాలంటే ప్రతిపక్ష నాయకుడు అయిన కేసీఆర్ చేయాలి కానీ కేటీఆర్ కాదన్నారు. కేటీఆర్ కు దమ్ముంటే కేసీఆర్ దగ్గర నుంచి ప్రతిపక్ష హోదా తెచ్చుకొని చాలెంజ్ చేయాలని సూచించారు. కేసీఆర్ రెండు లక్షల కోట్లు ఖర్చు చేసి గోదావరికి జలాలు 948 టీఎంసీలు కాపాడుకోలేకపోయాడని విమర్శించారు.

## ఏం చేయబోతున్నామనేది తర్వాత చెబుతాం.. మల్లు రవి కీలక వ్యాఖ్యలు




హైదరాబాద్ ,10 జూలై (ప్రజా పత్రిక): క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తో వరంగల్ కాంగ్రెస్ నేతలు నిర్వహించిన సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా మల్లు రవి మీడియాతో మాట్లాడారు. వరంగల్ ఇష్యూ పై రెండు గంటల పాటు చర్చించాం. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వారి అభిప్రాయాలు చెప్పారు. ఎమ్మెల్యేల అభిప్రాయాల మేరకు ఏం చేయాలనేది తర్వాత చెబుతాం. మరోసారి భేటీ ఎప్పుడు ఉంటుందనేది సమాచారం ఇస్తాం అని మల్లు రవి మీడియాకు వివరించారు. మల్లు రవితో భేటీ అయిన ఎమ్మెల్యేల్లో కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి ఉన్నారు. కొండా మురళి అంశంపై కమిటీ మందు వాదనలు వినిపించారు. ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలను ఉద్దేశించి కొండా మురళి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో ఇటీవల క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నోటీసుకు కొండా మురళి వివరణ ఇచ్చారు. తాజాగా ఆయన వ్యతిరేక వర్గం ఇవాళ వాదనలు వినిపించింది.

## ఎక్సైజ్ శాఖ కల్లు కాంపౌండ్ వారితో కుమ్మకైంది.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హాట్ కామెంట్స్..!




హైదరాబాద్,10 జూలై (ప్రజా పత్రిక):సైకోట్రోపిక్ కల్లు ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఓ కల్లు కాంపౌండ్ లో కల్లులో సైకో ట్రోఫిక్ సబ్‌స్టెన్స్ కలపడం వల్ల అనధికారికంగా 6 మంది మృతి చెందారని, పలువురి ఆరోగ్యం విషమించిందని ఆయన తెలిపారు. రెండు సీసాల కల్లు తాగినవారిలో కిడ్నీలు దెబ్బతిన్నాయనడం ఆందోళన కలిగించే విషయమని వ్యాఖ్యానించారు. ఈ ఘటనలో ఒకే ఆసుపత్రిలో 31 మందికి చికిత్స జరుగుతోందని, బాధితుల పరిస్థితి అత్యంత విషమంగా ఉందని రామచందర్ రావు తెలిపారు.

ఇది ఇప్పుడు కొత్తగా జరిగిన ఘటన కాదని.. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగాయని గుర్తుచేశారు. ఆయన ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఎక్సైజ్ శాఖ కల్లు కాంపౌండ్‌ల యజమానులతో కుమ్మకై అయ్యిందని ఆరోపించారు. ఈ విషయంలో ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని, కళ్లు కాంపౌండ్‌లపై ప్రతిరోజు తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. ఏ రకంగా చూసినా ఈ విషప్రయోగ ఘటనపై ప్రభుత్వం బాధ్యత వహించి బాధిత కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని ఆయన అన్నారు.

మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల పరిహారం ఇవ్వాలని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రతి బాధితుడికి రూ. 1 లక్ష పరిహారం ఇవ్వాలని ఆయన అన్నారు. ఎక్సైజ్ శాఖ లోపాలను సమీక్షించి, కల్లు కాంపౌండ్‌లపై కఠినంగా నిఘా పెట్టాలన్నారు. ఇక బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి దుర్ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలతో ఆడుకునే వ్యవస్థపై నియంత్రణ ఉండాల్సిన అవసరం ఉందని రామచందర్ రావు స్పష్టం చేశారు.

## బెట్టింగ్ యాప్స్‌లో సెలబ్రిటీలపై కేసు.. బీజేపీతో ఉండే వాళ్ళను వదిలేస్తారా..?



హైదరాబాద్ ,10 జూలై (ప్రజా పత్రిక):బెట్టింగ్ యాప్స్ కి ప్రమోషన్ చేసిన రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీ లాంటి 29 మంది సెలబ్రిటీలపై కేసు నమోదు చేసినందుకు ఈడీకి ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెట్టింగ్ యాప్ లతో కోట్ల మంది యువకుల జీవితాలు నాశనం అయ్యాయని ఆరోపించారు. బెట్టింగ్ యాప్స్ పై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టులో కేసు వేశా.. న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే, ఈ కేసులో బీజేపీతో ఉండే వాళ్ళను వదిలేస్తారా? అని ప్రశ్నించారు. బాలకృష్ణ పైన కేసు ఎందుకు నమోదు చెయ్యరు?.. కూటమి ఎమ్మెల్యేలపై కేసు పెట్టలేదా? అని అడిగారు. ప్రజాస్వామ్యాన్ని బీజేపీ కూని చేస్తుంది అని ఆరోపించారు. అలాగే, సిగాచి ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓనర్లను ఎందుకు అరెస్ట్ చెయ్యలేదు?.. ఇదే యూరోపియన్ దేశాల్లో జరిగి ఉంటే కఠిన చర్యలు ఉండేవి, ఇండియాలో మాత్రం బెయిల్స్ వస్తాయని కేఏ పాల్ సెటైర్లు వేశారు.

అయితే, అదానీ, అంబానీలకు 15 లక్ష కోట్లు రుణమాఫీ చేస్తారు, కానీ పేదలకు మాత్రం ఏం చేయరు అని కేఏ పాల్ ప్రశ్నించారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు అమ్ముడు పోయారు.. సూపర్ సిక్స్ గురించి అడిగితే నాలుక కొస్తారా?.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ అభ్యర్థిని ప్రజలు కోరుకుంటే పెడుతాను అన్నారు. తనపై ఎన్ని కేసులు పెట్టిన భయపడేది లేదు.. ఇక, బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకుంటే బీజేపీతో పెట్టుకున్నట్లే అన్నారు. బీఆర్ఎస్– బీజేపీ ఒక్కటే అని చెప్పుకొచ్చారు. 5 శాతం లేని బీజేపీ 8 సీట్లు ఎలా గెలిచింది.. ఎందుకో తెలుసా.. బీఆర్ఎస్, ఈవీఎంల మహిమ వల్లే 8 ఎంపీ సీట్లలో గెలిచిందన్నారు. పురంధేశ్వరికి డిపాజిట్ కూడా రాకూడదు, కానీ ఈవీఎంలను మేనేజ్ చేసి గెలిచారని ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ ఆరోపించారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎంపీలకూ కోటా ఇవ్వాలి: సీఎంకు రఘునందన్ లేఖ



హైదరాబాద్,10 జూలై (ప్రజా పత్రిక): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు బహిరంగ లేఖ రాశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎంపీలకు కూడా 40 శాతం కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేల మాదిరిగానే ఎంపీలు కూడా ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులే అని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా 17 మంది ఎంపీలకూ అవకాశం కల్పించాలని కోరారు. లబ్ధిదారుల ఎంపికలో సహేతుకత పెరగడానికి ఇది దోహదపడుతుందన్నారు. పేద ప్రజలకు మరింత న్యాయం జరగడం కోసమే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులు కూడా ఇందులో వినియోగిస్తున్నట్లు వివరించారు. గతంలో ఎంపీగా పనిచేసిన సీఎం రేవంత్ వెంటనే నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నట్లు రఘునందన్‌రావు లేఖలో పేర్కొన్నారు.

## అవకాశం ఇస్తే.. మళ్లీ HCA బాధ్యతలు స్వీకరిస్తా

### : మాజీ ప్రెసిడెంట్ అజారుద్దీన్ ప్రకటన




హైదరాబాద్ ,10 జూలై (ప్రజా పత్రిక):హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్మోహన్‌రావు అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఐపీఎల్ టికెట్ల వివాదంలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా సీఐడీ అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. జగన్మోహన్‌రావుతోపాటు హెచ్‌సీఏ సభ్యులను కూడా సీఐడీ అరెస్ట్ చేసింది. తాజాగా ఈ పరిణామాలపై హెచ్‌సీఏ మాజీ ప్రెసిడెంట్, కాంగ్రెస్ నేత అజారుద్దీన్ స్పందించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధ్యక్షుడి అరెస్ట్ హెచ్‌సీఏకు అవమానం అని అన్నారు. టికెట్లు ఇచ్చిన తర్వాత అదనపు టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేయడం, ఒప్పుకోకపోతే వేధించే ప్రయత్నం చేయడం దారుణమని సీరియస్ అయ్యారు.

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కు తాను ఎంతో చేశారని అన్నారు. తక్షణమే అసోసియేషన్‌ను రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అవకాశం వస్తే.. తాను మళ్లీ HCA బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధమని ప్రకటించారు. గ్రూపు రాజకీయాలు పక్కనబెట్టి ఆటపై దృష్టి పెట్టాలని సూచించారు. మరోవైపు విజిలెన్స్ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. టికెట్ల విషయంలో సన్‌రైజర్స్‌పై హెచ్‌సీఏ ఒత్తిడి తీసుకొచ్చిందని.. 20శాతం టికెట్లు ఇవ్వాలని బెదిరింపులకు గురిచేసిందని విజిలెన్స్ కమిటీ నివేదిక ఇచ్చింది. ఈ నివేదిక ఆధారంగా సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలోనే హెచ్‌సీఏ ప్రెసిడెంట్ జగన్మోహన్ రావుతో పాటు పలువురిని అరెస్ట్ చేసింది.

## ఐదు గ్రామాలు మాకు ఇవ్వాల్సిందే.. ఏపీ సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్ ,10 జూలై (ప్రజా పత్రిక):భద్రాచలం పట్టణాన్ని ఆనుకొని ఉన్న ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏపీ సీఎం చంద్రబాబు నాయకుడి కి లేఖ రాశారు. ఉమ్మడి రాష్ట్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత పోలవరం ముంపు పేరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను చీకటి ఆర్డినెన్స్ ద్వారా ఏపీలో విలీనం చేయించుకున్నారని ఆరోపించారు. దీంతో లోయర్ సీలేరు పవర్ ప్లాంట్‌ను లాగేసుకొని తెలంగాణలో కరెంట్ కష్టాలకు కారకులయ్యారని ఆరోపించారు. పోలవరం పేరుతో భద్రాచల శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయాన్ని ముంచేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఏడు మండలాలను ఏకపక్షంగా విలీనం చేసుకోవడంతో భద్రాచలం పట్టణంలో అంతర్భాగంగా ఉన్న.. పట్టణాన్ని ఆనుకొని ఉన్న యటపాక, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భద్రాచలం రాముల వారి గుడి మన్యం భూములు పురుషోత్తపట్నం రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్నాయని పేర్కొన్నారు. రాములవారు తెలంగాణలో ఉంటే ఆయన మన్యం భూములు ఏపీలో ఉండటంతో ఆ భూముల్లో ఇష్టారాజ్యంగా కబ్జాలు కొనసాగుతున్నాయని వివరించారు. కబ్జాలను అడ్డుకునే ప్రయత్నం చేసిన భద్రాచలం రామాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమాదేవి పై కబ్జాదారులు దాడి చేసిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉందని వెల్లడించారు. రాముడి పేరు చెప్పి కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంలో మీరు భాగస్వామిగా ఉన్నారు. అదే రాములవారు కొలువై ఉన్న భద్రాచలం పట్టణాన్ని పోలవరంలో ముంచేసే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఐదు గ్రామాల ప్రజలు విద్య, వైద్యం సహా ఇతర సేవలు పొందడానికి, ఉపాధిని అందిపుచ్చుకోవడానికి వందల కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను పరిష్కరించడంతో పాటు భద్రాచలం రాముల వారి భూముల పరిరక్షణ కోసం వెంటనే యటపాట, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

# గుప్పెడు గంధం కవితా సంపుటి ఆవిష్కరణ




హైదరాబాద్ ,10 జూలై (ప్రజా పత్రిక):సమాజంలోని అంశాలను, అనుభవాల సారాన్ని గుప్పెడు గంధం కవితా సంపుటిగా రూపొందించిన రచయిత రావుల పుల్లాచారి కృషిని వక్తలు ప్రశంసించారు. ప్రముఖ రచయిత రావుల పుల్లాచారి రచించిన గుప్పెడు గంధం కవితా సంపుటి ఆవిష్కరణ సభ రెడ్ హిల్స్‌లో గల రమణాచారి క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగింది. కథా సంపుటిని ఆవిష్కరించిన విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి రమణాచారి మాట్లాడుతూ కవితా సంపుటిలోని పలు కథలు తన మనోభావాలకు అనుగుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కథలలో తన విద్యార్థి జీవితాన్ని చూసుకునాన్ని అన్నారు. సమాజానికి మంచి సాహిత్యాన్ని అందిస్తున్న పుల్లాచారి మరిన్ని రచనలు చేయాలని ఆయన ఆకాంక్షించారు.

సభాధ్యక్షులు కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ డి.ఎస్.ఎన్ మూర్తి మాట్లాడుతూ.. కాలంతో మమేకమై పుల్లాచారి రచనలు చేశారని అన్నారు. కాళోజి నారాయణరావు పురస్కార గ్రహీత, పద్మ విభూషణ్ డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ ఈ సందర్భంగా కథా సంపుటిని సమీక్షించారు. ద్రావిడ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పులికొండ సుబ్బాచారి, ఆచార్య జయశంకర్ ఉత్సవ కమిటీ కన్వీనర్ ఎం దయానంద చారి, విశ్రాంత పోలీసు అధికారి పెద్దూరి వెంకట దాసు పాల్గొన్నారు.

ప్రజా పత్రిక
తెలుగు దినపత్రిక
శుక్రవారం 11 జులై 2025

# సినిమా న్యూస్

## రామోజీ ఫిల్మ్‌సిటీలో... ది ప్యారడైజ్



విజయవంతమైన 'దసరా' తర్వాత కథానాయకుడు నాని - దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మరోసారి జట్టు కట్టారు. ఈ కలయికలో రూపొందుతున్న చిత్రమే... 'ది ప్యారడైజ్' . ఎస్.ఎల్.వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీతోపాటు... మొత్తం 8 భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రస్తుతం రామోజీ ఫిల్మ్‌సిటీలో చిత్రీకరణ చేసుకుంటోంది. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సెట్‌లో యాక్షన్ కొరియోగ్రాఫర్ రియల్ సతీశ్ నేతృత్వంలో భారీ యాక్షన్ ఎపిసోడ్‌ని చిత్రీకరిస్తున్నారు. సినిమాకి కీలకమైన ఈ సన్నివేశాల్లో విదేశీ యాక్షన్ నిపుణులు కూడా పాల్గొంటున్నట్టు చిత్రబృందం తెలిపింది ."గ్లోబల్ స్థాయిని లక్ష్యంగా చేసుకుని రూపొందిస్తున్న చిత్రమిది. ఇప్పటికే విడుదల చేసిన టైటిల్ పోస్టర్, ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని పెంచాయి. అందుకు తగ్గట్టుగా సినిమా రూపొందుతోంద"ని సినీ వర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాది మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, సంగీతం: అనిరుధ్ రవిచందర్.

## విజయ్ సేతుపతి 'సార్ మేడమ్' టైటిల్ టీజర్ విడుదల




మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, నేషనల్ అవార్డు విన్నర్ నటి నిత్యా మీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'తలైవన్ తలైవి' . ఈ సినిమాకు పాండిరాజ్ దర్శకత్వం వహిస్తుండగా.. టీజీ త్యాగరాజన్ సమర్పణలో సత్య జ్యోతి ఫిలిమ్స్ బ్యానర్‌పై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా జూలై 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ఇప్పటికే తమిళంలో టీజర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాను తెలుగులో సార్‌మేడమ్ పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్.

ఫుడ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. ఈ టీజర్‌లో విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ మధ్య ఉండే కెమిస్ట్రీని చూపించారు మేకర్స్. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో యోగిబాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## వయసు కాదు.. కెమిస్ట్రీ ముఖ్యం



ప్రసిద్ధ నటుడు ఆర్. మాధవన్, ఫాతిమా సనా షేక్ జంటగా నటించిన చిత్రం 'ఆప్ జైసా కోయి'. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రేమకథా నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి వివేక్ సోని దర్శకత్వం వహించగా, కరణ్ జోహార్ నిర్మాణ బాధ్యతలు తీసుకున్నారు. జులై 11 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. అయితే ఈ మూవీ ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాధవన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చకు కారణమయ్యాయి. ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ, వయసు వ్యత్యాసం, వైవాహిక జీవితం పై ప్రభావం వంటి అంశాలపై ఆయన ఎంతో స్పష్టంగా, కొంత సాహసంగా అభిప్రాయాలు వెల్లడించారు.

'సహ నటీనటుల మధ్య నిజమైన అనుబంధం ఉంటేనే కెమిస్ట్రీ బాగా పని చేస్తుంది. అది లేకపోతే ఎలాంటి సన్నివేశాలైనా ఎమోషనల్‌గా పండవు. ఇది కొంచెం వివాదాస్పదంగా వినిపించవచ్చు కానీ.. నా అభిప్రాయం ప్రకారం, వివాహితులు ఇతరులతో రొమాంటిక్ సన్నివేశాల్లో నటించడం అంత సహజంగా ఉండదు. మనసులో ఎక్కడో కొంత ఆంక్ష ఉంటుంది. అలాగే వయసు వ్యత్యాసం అనేది సినిమా కథకు పెద్ద అడ్డంకి కాదు. నిజ జీవితంలో కూడా వయసులో తేడా ఉన్న జంటలు చాలానే ఉన్నారు. ప్రేక్షకులు కథకి స్పందిస్తారు, నటుల వయసుకు కాదు' అంటూ తెలిపారు. ప్రజంట్ ఈ మాటలు వైరల్ అవుతున్నాయి.

## నా ఫస్ట్ లవ్ అతడితోనే.. ఇప్పటికీ మధుర జ్ఞాపకంగా మిగిలింది !



టాలీవుడ్‌లో తనదైన శైలి, సంప్రదాయ నటనతో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నటి అనుష్క శెట్టి. తొలి చిత్రంతోనే అందరి హృదయాలను గెలుచుకున్ని, ఆ తర్వాత మంచి అవకాశాలు అందుకొని.. స్టార్ హీరోల సరసన నటించి మెప్పించింది. అయితే అనుష్క శెట్టి గురించి అభిమానులు కోరుకుంటున్నది ఒక్కటే. ఇప్పటికీ అనుష్క శెట్టి ఎందుకు పెళ్లి చేసుకోవడం లేదని సందేహిస్తున్నారు. కానీ తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన తొలి ప్రేమ గురించి స్పందించి అభిమానులను ఆశ్చర్యపరిచింది. సాధారణంగా వ్యక్తిగత విషయాల్లో నిమిత్తమాత్రంగా స్పందించే అనుష్క, ఈసారి తన ఫస్ట్ లవ్‌ను ఓ మధురానుభూతిగా అభివర్ణించింది.

అనుష్క మాట్లాడుతూ.. 'నాకు ఆరో తరగతి చదువుతుండగా ఒక క్లాస్‌మేట్ నా దగ్గరికి వచ్చి 'ఐ లవ్ యూ' అన్నాడు. నాకు ఆ మాట అర్థమో తెలియదు కానీ, ఏదో మనసుకు బాగా నచ్చేసి..నేను అతనికి 'ఓకే' చెప్పేశాను. నిజంగా అది ఎంతో చిన్న విషయమే అయినా, నాకు ఇప్పటికీ మధుర జ్ఞాపకంగా మిగిలి పోయింది' అని తెలిపింది. ఇలా ఓ స్టార్ హీరోయిన్ తన వ్యక్తిగత జీవితంలోని చిల్డిష్ మూమెంట్‌ని ఈ విధంగా పంచుకోవడం అభిమానులకు సర్ప్రైజ్‌లా మారింది. దీంతో ఈ ఫస్ట్ లవ్ స్టోరీ పై సోషల్ మీడియాలో అభిమానులు పెద్దగా స్పందిస్తున్నారు."అనుష్క ఫస్ట్ లవ్ గురించి చెప్పిన విధానం చక్కగా ఉంది", "అనుష్కలోని అమాయకత్వం ఇప్పటికీ అలాగే ఉందని అర్థమవుతుంది" అంటూ కామెంట్లు పెడుతున్నారు.

ఇక ప్రస్తుతం అనుష్క శెట్టి నటించిన 'ఘాటీ' అనే సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమాలో ఆమె భిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. గతంలో 'అరుంధతి', 'భాగమతి', 'నిశ్శబ్దం' వంటి పాత్రలతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన అనుష్క, ఈసారి మరోసారి తాను ఎలా అలరిస్తుందో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు ప్రేక్షకులు.